(నేడు జయశంకర్ సార్ వర్ధంతి)

'మా తెలంగాణ మాగ్గావాలె, స్వయం పాలనలో శాసిస్తాం. కానీ, ఇతరుల పాలనలో ప్రస్తుతం యాచిస్తున్నాం.'

- ప్రొఫెసర్ జయశంకర్



## నమస్తే తెలంగాణ

# కరెంటుపై కోతలు

**నమ్మి** నానబోస్తే పుచ్చి బుర్రలయ్యాయని సామెత. ఏదో వెలగబెడతారని కాంగ్రెస్‌కు అధికారమిస్తే చీకట్లు పాల్జేశారని జనం నివ్వెరపోతున్నారు. కరెంటు కోతలతో రాష్ట్రం అతలాకుతలమవుతున్నది. కానీ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాత్రం కనురెప్ప పాటు కూడా కరెంటు పోవడం లేదని సెలవిస్తున్నారు. ఆయన మాటలు హాస్యాస్పదంగా ధ్వనిస్తున్నాయి. కరెంటు కోతలకు నిరసనగా ప్రజలు రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది. పొలాలను ట్యాంకర్ల నీటితో తడుపుకొంటూ రైతులు నానా తంటాలు పడుతున్నారు. అధికారిక కార్యక్రమాల్లోనే కరెంటు పోయి అభాసుపాలవుతున్నారు. పోలీసు భద్రతతో పాటుగా కరెంటు పోతే సత్వరమే చర్యలు తీసుకునేందుకు డిస్కం అధికారులను కూడా సంసిద్ధంగా ఉంచుతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే ప్రభుత్వం ఉన్న మాట అంటే ఉలిక్కి పడుతున్నది. కోతలపై నిరసన తెలిపేవారి ఇండ్ల మీదకు విద్యుత్తు సిబ్బందిని పంపి ధర్నాలు చేయిస్తున్నది. సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న కరెంటు కష్టాలను సామాజిక మాధ్యమం ద్వారా వెలుగులోకి తెచ్చేందుకు ప్రయత్నించిన ఓ మహిళా జర్నలిస్టుపై కేసు పెట్టడం ప్రభుత్వ నిస్పృహకు పరాకాష్ఠ. తీగలపై తొండలు పడటం వల్ల కరెంటు పోతున్నదనే వాదన విస్మయం కలిగిస్తున్నది.

సమస్యను పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వం ఏదోరకంగా వివాదాలు సృష్టించాలని చూస్తున్నది. నిన్నటి పాలకులను వేధించే పనిలో తలమునకలుగా ఉన్నది. నానా తంటాలు పడి పొరుగు రాష్ట్రం నుంచి కొనుగోలు చేసి 24 గంటలు నాణ్యమైన కరెంటు సరఫరా చేసిన బీఆర్ఎస్ సర్కారుపై దుమ్మెత్తి పోయాలని చూస్తున్నది. విచారణ కమిషన్ల పేరిట వేధించాలని ఎత్తులు వేస్తున్నది. నీళ్లు, కరెంటు సరఫరా మెరుగుపర్చడం అనేవి కేసీఆర్ పాలనకు ముద్రలుగా మిగిలిపోయాయి. ఇవి ప్రజలకు ప్రత్యక్షంగా అనుభూతమైనవే. ఇప్పుడు మారిన పరిస్థితిలో ఆ ప్రజలే ఇబ్బందులు పడుతున్నారు. కానీ కాంగ్రెస్ సర్కారు మాత్రం నీళ్లు, కరెంటునే లక్ష్యంగా చేసుకొని ఇదివరకటి సర్కారును ఏదోరకంగా బదనాం చేయాలని చూడటం విచిత్రం. అందుకు నానా కుట్రలు పన్నుతున్నది. ప్రభుత్వాల స్థాయిలో కుదిరిన ఒప్పందాలపై, ప్రభుత్వరంగ సంస్థలకు ఇచ్చిన ఆర్డర్లపై అనుమానాలు రేకెత్తించాలని చూస్తున్నది. వితండ వాదాలతో వివాదాలు సృష్టించేందుకు అవస్థలు పడుతున్నది.

కరెంటు సరఫరా విషయంలో ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ప్రభుత్వం చెప్తున్నట్టుగా మిగులు కరెంటు ఉంటే కోతలు ఎందుకు తలెత్తుతున్నాయి? పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చినా సరఫరాకు ఇబ్బంది ఉండబోదని అంటున్నారు. ఇంకా ఒకడుగు ముందుకు వేసి 24 గంటలు ఉచిత సరఫరా చేస్తామంటున్నారు. కొత్త విద్యుత్తు విధానం తెస్తామని బీరాలు పలుకుతున్నారు. ఏం చేస్తున్నావే కోడలా అంటే పారబోసి ఎత్తుకుంటున్నా అత్తా అన్నట్టుగా బీఆర్ఎస్ హయాంలో మెరుగుపడిన కరెంటు సరఫరాను ఆగం చేసినోళ్లే ఏదో ఊడబొడుస్తామన్నట్టు మాట్లాడటం వింత. ఆగమాగం చేసి అధికారంలోకి రావడం సరే. పరిపాలనా సామర్థ్యం దగ్గర కాంగ్రెస్ నేతల పస బయటపడుతున్నది. దీంతో వివాదాల మాటున తప్పించుకోవాలని చూస్తున్నారు. కానీ, ప్రజల ప్రత్యక్షానుభవానికి సంబంధించిన విషయాలను మసిపూసి మారేడు కాయ చేయాలనుకోవడం అత్యాశేనని కాంగ్రెస్ పాలకులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.


## మొదట్నుంచీ మొత్తుకుంటూనే ఉన్నాం!

*పాట్నా హైకోర్టు ఇచ్చిన రిజర్వేషన్ల తీర్పుపై సీఎం నితీశ్‌కుమార్ ఎందుకు మౌనంగా ఉన్నారో అర్థం కావడం లేదు. మోదీ కాళ్లపై పడైనా సరే రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో రిజర్వేషన్లను చేర్పించాలి.*

*- తేజస్వీ యాదవ్, ఆర్జేడీ నేత*

# దివాలా నుంచి దిల్‌వాలా వరకూ..!

**రాష్ట్రంలో ఎటుచూసినా చీకట్లే..
కంపెనీ తెరుద్దామంటే కరెంటు లేకపాయె..
మెషిన్ కట్క ఏద్దామంటే విద్యుత్తు ఉండకపాయె..
పరిశ్రమలను నడుపుదామంటే విద్యుత్తుకు కటకట ఉండే..
అయ్యా.. బిల్లులు కడతాం.. కరెంటు ఇవ్వండని మొత్తుకున్నా..
కరెంటు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వమది
వెరసి పరిశ్రమల మూసివేత..
పవర్ హాలీడేలు..
దీంతో ఉపాధిలేక రోడ్డునపడ్డ లక్షలాది మంది కార్మికులు..
పడకేసిన ఉత్పాదకత.. అడుగంటిన జీఎస్డీపీ.. తలసరి ఆదాయం అధఃపాతాళానికి..
మొత్తంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థే చిన్నాభిన్నమైన దుస్థితి..
ఇదీ 2014కు ముందు సమైక్యపాలనలో తెలంగాణ దురవస్థ.**





ఎడిటోరియల్ డెస్క్

| 2014కు ముందు.. పదేండ్లలో | 2014 తర్వాత.. పదేండ్లలో |
|---|---|
| తెలంగాణలో ఏర్పాటైన పరిశ్రమలు - 12 వేలు | తెలంగాణలో ఏర్పాటైన పరిశ్రమలు - 23 వేలు |
| పరిశ్రమలకు రోజువారీగా ఇచ్చిన విద్యుత్తు - 5 గంటలు | పరిశ్రమలకు రోజువారీ కరెంట్ - 24 గంటలు |
| కరెంటు లేక మూతబడిన పరిశ్రమలు - 10 వేలు | కరెంటు లేక మూతబడిన పరిశ్రమలు - 0 |
| పారిశ్రామిక రంగంలో ఎంతమందికి ఉపాధి - 6.64 లక్షలు | పారిశ్రామిక రంగంలో ఎంతమందికి ఉపాధి - 22.5 లక్షలు |

**2014 తర్వాత..:** ఏ రాష్ట్రమైనా ఆర్థికప్రగతి సాధించాలన్నా.. ప్రజల జీవనప్రమాణాలు మెరుగవ్వాలన్నా ఉపాధి అవకాశాలు కల్పించడమే మార్గమని కేసీఆర్ భావించారు. పరిశ్రమలు, కంపెనీలు నిరంతరాయంగా పనిచేస్తే.. కార్మికులకు చేతినిండా పని లభిస్తుంది. తద్వారా వారి ఆదాయం పెరుగుతుంది. రాష్ట్ర జీఎస్డీపీ ఉరకలేస్తుంది. ఇదంతా కేసీఆర్‌కు తెలియంది కాదు. అందుకే, పరిశ్రమలకు అవసరమైన నిరంతరాయ కరెంటును సరఫరా చేయాలని ఆయన నిర్ణయించుకున్నారు. విద్యుత్తు కోతలు, పవర్‌హాలీడేలే ఉండొద్దని నిశ్చయించుకున్నారు. అలా.. మొక్కవోని దీక్షతో.. అధికారంలోకి వచ్చిన కేవలం 4 నెలల్లోనే గృహ, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్తును కేసీఆర్ ప్రభుత్వం సరఫరా చేసింది. వెరసి గడిచిన పదేండ్లలో రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వెల్లువెత్తాయి. వేలాది కంపెనీలు క్యూకట్టాయి. దీంతో లక్షలాదిగా ఉద్యోగాల సృష్టి జరిగింది. దేశ విదేశాలకు చెందిన కంపెనీలు తెలంగాణను పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చుకున్నాయి. దీంతో ఉత్పాదకత పెరిగింది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. జీఎస్డీపీ, తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ రారాజుగా నిలిచింది.

**కరెంటు ఇవ్వండని గగ్గోలు పెట్టినా...:** సమైక్య పాలనలో తెలంగాణలో పారిశ్రామికవేత్తల కరెంటు కష్టాలు అంతాఇంతాకాదు. ఉమ్మడి ఏపీలో ఎప్పుడూ కోతలే. వారంలో మూడు రోజులు మాత్రమే విద్యుత్తు సరఫరా ఉండేది. అది కూడా ఉదయం మూడు గంటలు, సాయంత్రం మూడు గంటలు మాత్రమే. నెలలో పరిశ్రమలు 10-15 రోజులు మాత్రమే నడిచేవి. బిల్లులు చెల్లిస్తాం.. విద్యుత్తు సరఫరా చేయండని పారిశ్రామికవేత్తలు గగ్గోలుపెట్టినా.. తగిన విద్యుత్తును కూడా సరఫరా చేయలేని అసమర్థ ప్రభుత్వం ఏలుబడి అది. పరిశ్రమల మూసివేతతో పనిలేక, గ్రామాలకు పోలేక ఎంతోమంది కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు. మరెంతో మంది వేరే రాష్ట్రాలకు వలసబాట పట్టారు. కరెంటు కష్టాలతో దాదాపు 10 వేల పరిశ్రమలు మూతబడ్డాయి. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ రోజూ ధర్నాలు, నిరసనలు హోరెత్తేవి.

### నిరంతరాయ విద్యుత్తుతో రాష్ట్రానికి పరిశ్రమల క్యూ

| సంవత్సరం | మొత్తం పరిశ్రమలు | పెట్టుబడులు (రూ. కోట్లలో) |
|---|---|---|
| 2014-15 | 174 | 1,806 |
| 2015-16 | 1,530 | 28,964 |
| 2016-17 | 1,704 | 34,231 |
| 2017-18 | 2,804 | 58,258 |
| 2018-19 | 2,795 | 34,508 |
| 2019-20 | 3,032 | 40,506 |
| 2020-21 | 3,422 | 16,092 |
| 2021-22 | 4,091 | 18,893 |
| 2022-23 | 3,184 | 26,782 |
| 2023-24 (మే వరకు) | 361 | 2,246 |
| మొత్తం | 23,093 | 2,62,286 |

**జిగేల్‌మన్న పరిశ్రమలు...** :ప్రత్యేక రాష్ట్రసాధన అనంతరం 2014లో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం.. పరిశ్రమలకు అవసరమైన నిరంతరాయ నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని సంకల్పించింది. దేశంలో ఎక్కడ కరెంటు ఉంటే అక్కడి నుంచి కొనుగోలు చేయడమే కాకుండా పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని కొత్త ప్రాజెక్టుల నిర్మాణాన్ని అప్పటి సీఎం కేసీఆర్ చేపట్టారు. విద్యుదుత్పత్తి ప్రాజెక్టులకు, విద్యుత్తు రంగానికి బడ్జెట్‌లో మెజారిటీ నిధులు కేటాయించారు. దీంతో కేవలం నాలుగు నెలల్లోనే పరిశ్రమలకు 24 గంటల నిరంతరాయ విద్యుత్తు సాకారమైంది. ఇది తెలిసి.. రాష్ట్రంలో కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఆసక్తి కనబర్చారు. అలా గడిచిన పదేండ్లలో కొత్తగా 23 వేల పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. దీంతో కొత్తగా 22.5 లక్షల మందికి ఉపాధి లభించింది. ఉమ్మడి పాలనలో వారానికి మూడు రోజులు మాత్రమే నడిచిన పరిశ్రమలు.. కేసీఆర్ పాలనలో 24 గంటలపాటు మూడు షిఫ్టుల్లో పనిచేసేవి.

**తొమ్మిదిన్నరేండ్లలో జీఎస్డీపీ మూడింతలు...:** ఒక రాష్ట్ర ప్రగతికి జీఎస్డీపీనే ప్రామాణికం. తెలంగాణలో నిరంతరాయ కరెంటుతో పారిశ్రామిక ప్రగతి జరిగి తద్వారా రాష్ట్రంలో ఉత్పాదకత పెరిగింది. దేశ జనాభాలో 2.9 శాతం వాటా మాత్రమే ఉన్న తెలంగాణ.. దేశ జీడీపీలో 4.9 శాతం వాటాను కలిగి ఉంది. ఇదంతా కేసీఆర్ హయాంలో జరిగిన పురోగతే. 2013-14లో తెలంగాణ జీఎస్డీపీ రూ. 3.79 లక్షల కోట్లుగా ఉంటే.. 2023 నాటికి అది మూడు రెట్లు పెరిగి రూ.13.28 లక్షల కోట్లకు చేరింది. 2020-21లో ఒకవైపు కరోనా సంక్షోభం యావత్తు ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేసినా.. కేంద్రం చిల్విగవ్వ ఇవ్వకున్నా తెలంగాణ మాత్రం వెనుదిరిగి చూడలేదు. ఆ సమయంలో దేశ జీడీపీ -1.4 శాతం మేర పడిపోగా.. తెలంగాణలో మాత్రం 1.2 వృద్ధిరేటు నమోదైంది.

తెలంగాణ జీఎస్డీపీ కింగ్...
2014లో జీఎస్డీపీ - రూ.3.79 లక్షల కోట్లు
2023లో జీఎస్డీపీ - రూ.13.28 లక్షల కోట్లు
పెరుగుదల - 251 శాతం

**మీకు తెలుసా?**

**ఒక్క ఏడాదిలో తెలంగాణ నమోదు చేసే జీఎస్డీపీతో మన పొరుగున ఉన్న భూటాన్‌ను 52 ఏండ్ల పాటు పోషించవచ్చు.**

**తలసరిలో మనమే టాప్...:** నిరంతరాయ కరెంటు సరఫరాతో పరిశ్రమలు క్యూ కడతాయి. కంపెనీలు వస్తే కార్మికులకు చేతినిండా పని ఉంటది. కేసీఆర్ హయాంలో తెలంగాణలో ఇదే జరిగింది. నిరంతరాయ కరెంటు సరఫరాతో తెలంగాణకు పరిశ్రమలు తరలివచ్చాయి. దీంతో ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరిగి వారి ఆర్థిక పరిస్థితులు మెరుగయ్యాయి. ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందిందని చెప్పేందుకు తలసరి ఆదాయాన్నే గీటురాయిగా తీసుకొంటారు. అంతటి ప్రాధాన్యమున్న తలసరి ఆదాయ వృద్ధిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 2013-14లో తెలంగాణ తలసరి ఆదాయం రూ. 93,151గా ఉంటే.. గత నవంబర్‌నాటికి ఇది రూ.3,12,398కి చేరింది. ఇక, దేశానికి రోల్‌మాడల్ అని బీజేపీ నేతలు గొప్పగా చెప్పుకొనే గుజరాత్ తలసరి ఆదాయ జాబితాలో టాప్-10లో కూడా లేదు. ప్రధాని నరేంద్రమోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి ఉన్న ఉత్తరప్రదేశ్ ఈ జాబితాలో అట్టడుగున ఉన్నది. దేశ సగటు తలసరి ఆదాయం రూ.1,72,000 కంటే తెలంగాణ పౌరుడి తలసరి ఆదాయం రూ. 1,40,398 ఎక్కువ.

తెలంగాణ తల'సిరి'...
2014లో తలసరి ఆదాయం- రూ.93,151
2023లో తలసరి ఆదాయం - రూ.3,12,398
పెరుగుదల - 235 శాతం

**మీకు తెలుసా?**

**మనకంటే వందేండ్ల ముందు రాష్ట్రంగా ఏర్పడి, మూడు రెట్లు ఎక్కువ జనాభా ఉన్న బీహార్ పౌరుడి తలసరి ఆదాయం రూ.54,383 మాత్రమే. అంటే బీహార్‌లోని ఆరుగురు సభ్యులున్న ఓ కుటుంబం ఆర్జించే సంపాదనను తెలంగాణలో ఒక్క వ్యక్తే సంపాదించగలడు.**

### దేశ జీడీపీ-తెలంగాణ జీఎస్డీపీ (రూ. కోట్లలో)

| సంవత్సరం | తెలంగాణ జీఎస్డీపీ | దేశ జీడీపీ | జీడీపీలో తెలంగాణ వాటా (శాతాల్లో) |
|---|---|---|---|
| 2013-14 | 3,79,000 | 1,12,33,511 | 3.37 |
| 2014-15 | 5,05,849 | 1,24,67,959 | 4.05 |
| 2015-16 | 5,77,902 | 1,37,71,874 | 4.19 |
| 2016-17 | 6,58,325 | 1,53,91,669 | 4.27 |
| 2017-18 | 7,50,050 | 1,70,90,042 | 4.38 |
| 2018-19 | 8,57,427 | 1,88,99,668 | 4.53 |
| 2019-20 | 9,48,356 | 2,00,74,856 | 4.72 |
| 2020-21 | 9,69,656 | 1,98,00,914 | 4.89 |
| 2021-22 | 11,54,846 | 2,36,64,639 | 4.88 |
| 2022-23 | 13,28,000 | 2,72,03,767 | 4.89 |



### తొమ్మిదిన్నరేండ్లలో తెలంగాణ, జాతీయ తలసరి ఆదాయాల్లో పెరుగుదల ఇలా.. (రూపాయల్లో)

| సంవత్సరం | తెలంగాణ | | దేశం | |
|---|---|---|---|---|
| | తలసరి | వృద్ధి (శాతం) | తలసరి | వృద్ధి (శాతం) |
| 2013-14 | 93,151 | 8.52 | 83,119 | 8.1 |
| 2014-15 | 1,24,104 | 10.6 | 86,647 | 9.5 |
| 2015-16 | 1,40,840 | 13.5 | 94,797 | 9.4 |
| 2016-17 | 1,59,395 | 13.2 | 1,03,870 | 9.6 |
| 2017-18 | 1,79,358 | 12.5 | 1,15,224 | 10.9 |
| 2018-19 | 2,09,848 | 17.0 | 1,25,946 | 9.3 |
| 2019-20 | 2,31,379 | 10.3 | 1,32,115 | 4.9 |
| 2020-21 | 2,31,103 | -0.1 | 1,26,855 | -4.0 |
| 2021-22 | 2,75,443 | 19.2 | 1,50,007 | 18.3 |
| 2022-23 | 3,12,398 | 13.8 | 1,72,000 | 13.7 |

# సింగరేణికి గొడ్డలిపెట్టు ఎవరు?

**కేంద్రంలో కొలువైన కొత్త ప్రభుత్వం వల్ల ఎలాంటి గుదిబండ మీద పడుతుందోనని ఆందోళన చెందుతుండగానే బొగ్గు గనుల వేలం రూపంలో ప్రమాదం రానే వచ్చింది. ఈ నెల 21న హైదరాబాద్‌లో జరగనున్న వాణిజ్య బొగ్గు గనుల పదో విడత వేలం రూపంలో ప్రమాదం ముంచుకొచ్చింది. సింగరేణిని కాపాడుతామని గతంలో భరోసా ఇచ్చిన బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చేతులమీదుగా ఈ వేలం ప్రారంభం కానుండటం గమనార్హం. హఠాత్తుగా ముంచుకొచ్చిన ఈ పరిణామంతో సింగరేణిలో మళ్లీ అలజడి మొదలైంది.**



మేరుగు రాజయ్య
94414 40791

సింగరేణిలో అలజడులు కొత్త కాదు. 1889లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైన నాటి నుంచి ఈ 135 ఏండ్లలో హక్కుల పరిరక్షణ కోసం ఎన్నో సుదీర్ఘ పోరాటాలు జరిగాయి. సింగరేణి కార్మికులు ఆర్థిక పోరాటాలకే పరిమితమవుతారన్న అపోహలను పక్కకుపెట్టి తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలోనూ కార్మికులు ప్రధాన భాగస్వాములయ్యారు. అలాగే సింగరేణిని బీఐఎఫ్ఆర్ (బోర్డ్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఫైనాన్షియల్ రీకన్‌స్ట్రక్షన్) పరిధి నుంచి కాపాడుకున్నారు. 1998-1999 ఆర్థిక సంవత్సరం నుంచి నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తూ లాభాలను సాధించుకున్నారు.

లక్ష్యానికి మించి బొగ్గు ఉత్పత్తి చేస్తూ దేశాభివృద్ధికి కృషి చేస్తున్న సింగరేణి సంస్థపై వేటు వేయడం సరికాదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 780 మిలియన్ టన్నులకు గానూ 773.64 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. కానీ, సింగరేణి మాత్రం నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 70 మిలియన్ టన్నులకు గానూ 70.02 మిలియన్ టన్నులతో రికార్డు సృష్టించింది. లక్ష్యానికి మించి కష్టపడుతున్నా సింగరేణి భవిష్యత్తు గురించి ఆందోళనలు కొనసాగుతూనే ఉండటం బాధాకరం.

బొగ్గు గనుల నిబంధనల ప్రత్యేక చట్టాన్ని 2015లో పార్లమెంటు ఆమోదించింది. దాంతో పాటు ప్రభుత్వ బొగ్గు పరిశ్రమకు రక్షణగా ఉన్న బొగ్గు గనుల జాతీయాకరణ చట్టం-1973ను 2018 జనవరి 18న కేంద్రం రద్దు చేసింది. సాక్షాత్తూ ప్రధాని మోదీ 2020 జూన్ 18న కమర్షియల్ మైనింగ్ ప్రాతిపదికన బొగ్గు గనులను కేటాయించే వేలాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రభుత్వ బొగ్గు పరిశ్రమ భవిష్యత్తుపై ఆందోళనలు ఎక్కువయ్యాయి. గతంలో జరిగిన బొగ్గు గనుల వేలంలో సింగరేణికి చెందిన కోయగూడెం, సత్తుపల్లి-3 గనులు ప్రైవేటుపరం అయ్యాయి. సింగరేణి యాజమాన్యం తెలంగాణలోని గనుల కోసం వేలంలో పాల్గొనకుండా ఒరిస్సాలోని నైనీ గనిని దక్కించుకున్నది. ఈ నేపథ్యంలో తవ్వకాలు ప్రైవేటుకు అప్పగించారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి.

2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశంలో 997.25 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అయింది. అయినప్పటికీ 268.24 మిలియన్ టన్నుల బొగ్గును దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది.

పారిశ్రామికాభివృద్ధితో పాటు థర్మల్ విద్యుత్తు ఉత్పత్తికి బొగ్గు ప్రధాన ఇంధనం. మన దేశంలో 2,21,802.59 మెగావాట్ల స్థాపిత విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన 106 ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. వాటిలో బొగ్గు ఆధారిత కేంద్రాలు 53 ఉన్నాయి. దేశీయంగా బొగ్గు ఉత్పత్తిని పెంచుకోవలసిన అవసరాన్ని ఇది నొక్కిచెప్తున్నది. కానీ, ప్రభుత్వం అనుసరిస్తున్న 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, కమర్షియల్ మైనింగ్ కారణంగా ప్రైవేటు కంపెనీలు కూడా బొగ్గును ఉత్పత్తి చేస్తుండటంతో ప్రభుత్వ పరిశ్రమల మనుగడకు ముప్పు ఏర్పడింది. అంతేకాకుండా, బొగ్గు



ధరల స్థిరీకరణ దెబ్బతింటున్నది. దాంతో విద్యుత్తు ఛార్జీలతో పాటు ఇనుము, ఉక్కు, సిమెంట్ ఇతర అనేక రంగాలలో ధరలు పెరుగుతున్నాయి. తద్వారా ప్రజలపై ఆర్థిక భారం పడుతున్నది. కార్మికుల వేతనాలు తగ్గి సామాజికాభివృద్ధి కుంటుపడుతున్నది.

2014 నుంచి బొగ్గు పరిశ్రమకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ మద్దతును ఉపసంహరించుకొన్నాయి. పైగా వివిధ పన్నుల రూపేణ 2022-2023లో కోల్ ఇండియా లిమిటెడ్ రూ.9,876 కోట్లు ప్రభుత్వానికి చెల్లించింది. అధికారిక లెక్కల ప్రకారం.. సింగరేణి 2018-2019 ఆర్థిక సంవత్సరం నుంచి 2022-2023 వరకు తెలంగాణ ప్రభుత్వానికి రూ.13,381.62 కోట్లు, కేంద్ర ప్రభుత్వానికి రూ.15,267.14 కోట్లు, ఒడిశా ప్రభుత్వానికి 12.54 కోట్లను చెల్లించింది.

కోల్ ఇండియా 2014-2015లో 494.24 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తుండగా.. 2023-2024 నాటికి అది 773.64 మిలియన్ టన్నులకు చేరుకున్నది. అలాగే 52.54 మిలియన్ టన్నుల నుంచి 70.02 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసే స్థాయికి సింగరేణి ఎదిగింది. అయినప్పటికీ ప్రభుత్వం కనీస చేయూతను ఇవ్వడం లేదు. పైగా వేలం ప్రక్రియ ప్రాతిపదికన బొగ్గు గనులను కేటాయిస్తూ ప్రభుత్వ బొగ్గు పరిశ్రమ అభివృద్ధికి గొడ్డలి పెట్టుగా మారుతున్నది.

ఇప్పటికే బొగ్గు తవ్వకాలకు సిద్ధంగా ఉన్న సత్తుపల్లి-3, కోయగూడెం గనులను వేలం కారణంగా సింగరేణి కోల్పోయింది. ఇప్పుడు 10వ విడత వేలంలో శ్రావణపల్లి బ్లాక్-1, 2లను కూడా కోల్పోతామనే ఆందోళన కార్మికుల్లో వ్యక్తమవుతున్నది. మంచిర్యాల జిల్లా మందమర్రికి కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌లకు రైల్వే రవాణా కూడా అందుబాటులో ఉన్నది. సింగరేణి యాజమాన్యం దాదాపు రూ.55 కోట్లు ఖర్చు చేసి 15.05 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో చదరపు కిలోమీటరుకి 10.16 డెన్సిటీతో 129 బోర్లు వేసింది. అక్కడ జీ-6, జీ-10 నాణ్యత కలిగిన 10 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్టు 1999లోనే అన్వేషణ పూర్తి చేసింది. అందువల్ల సింగరేణికి వేలం ప్రక్రియ ద్వారా కాకుండా నేరుగా గనులను కేటాయించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

**సింగరేణిని ప్రైవేటుపరం చేయబోమని ప్రధాని మోదీ గతంలో హామీ ఇచ్చారు. అప్పటి హోం శాఖ సహాయ మంత్రి, ఇప్పటి బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కూడా ప్రైవేటుపరం చేసే ప్రసక్తే లేదని భరోసా ఇచ్చారు. అందువల్ల తాజాగా జరిగే వేలంలో సింగరేణి బొగ్గు గనులను మినహాయించాలి. అంతేకాకుండా నేరుగా సింగరేణికే కేటాయించాలి. సింగరేణి ఆత్మనిర్భర్‌కు సహకరించాలని కార్మికులు కోరుతున్నారు.**

**వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే అర్హత పరీక్ష నీట్ వల్ల దక్షిణాదికి తీవ్ర అన్యాయం జరుగుతున్నది. గత రెండు, మూడేండ్ల టాప్-100 ర్యాంకులను పరిశీలిస్తే.. ఈ విషయం స్పష్టమవుతుంది. టాప్-100లోపు ర్యాంకుల్లో గతంలో దక్షిణాది విద్యార్థులు, మరీ ముఖ్యంగా తెలుగువారు ఎక్కువగా కనిపించేవారని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ మధ్యకాలంలో ఆ జాబితాలో దక్షిణాది విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతున్నది. ఈ ఏడాది టాప్-100 జాబితాలో తెలుగు విద్యార్థులు నలుగురు మాత్రమే ఉండటం గమనార్హం.**

# నీట్‌తో దక్షిణాదికి అన్యాయం



పుల్లెంల గణేష్
95530 41549

నీట్‌ను ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తుండటంతో ఉత్తరాదిలోని పలు రాష్ట్రాల్లో పేపర్ లీకేజీ ఘటనలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల పరీక్షా కేంద్రాల్లో మాస్‌కాపీయింగ్ జరుగుతున్నదని వైద్య నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్. రాజస్థాన్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో ప్రశ్నాపత్రం లీక్ అవడం, ఇన్విజిలేటర్లు సాయం చేయడం వంటి అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కారణంగానే ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులకు ఎక్కువ ర్యాంకులు వస్తున్నాయని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజా పేపర్ లీకేజీ ఉదంతం అందుకు మరింత బలాన్ని చేకూరుస్తున్నది.

సాధారణంగా వివిధ రాష్ట్రాల్లోని కళాశాలల్లోని 15 శాతం సీట్లు ఆల్ ఇండియా కోటా కిందికి వర్తిస్తాయి. నీట్‌లో మంచి ర్యాంకు వచ్చినవారికే ఈ సీట్లు దక్కుతాయి. అవకతవకల కారణంగా ఈ




సీట్లన్నీ ఉత్తరాది విద్యార్థులు కొల్లగొడుతున్నారు. దాంతో పాటు ఎయిమ్స్ లాంటి ప్రతిష్ఠాత్మక వైద్య విద్యాసంస్థల్లోనూ వారే ప్రవేశం పొందుతున్నారు. అంతేకాదు, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌ల నుంచి నీట్ రాసే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉన్నది. పైన పేర్కొన్న రాష్ట్రాలతో పాటు ఢిల్లీ నుంచి 2018లో 4,78,255 మంది విద్యార్థులు నీట్‌కు హాజరుకాగా.. 2024లో ఆ సంఖ్య 11,57,180కు చేరుకున్నది. 2018లో 13.26 లక్షల అభ్యర్థులు నీట్ రాసేందుకు నమోదు చేసుకోగా.. 2024లో 24.06 లక్షల మంది నమోదు చేసుకున్నారు.

దక్షిణాదిలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళలో వైద్య కళాశాలలు పెరిగాయే తప్ప నీట్ రాసే విద్యార్థుల సంఖ్య మాత్రం పెరగలేదు. 2018లో దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాల నుంచి 4,24,523 మంది నీట్‌కు హాజరుకాగా.. 2024 నాటికి ఆ సంఖ్య స్వల్పంగా పెరిగి 5,82,845కే పరిమితమైంది. ఇక దేశవ్యాప్తంగా 2018 నాటికి 499 మెడికల్ కాలేజీలు ఉండగా.. వాటిలో 70,012 ఎంబీబీఎస్ సీట్లు ఉండేవి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 706 మెడికల్ కాలేజీలు ఉండగా వాటిలో 1,08,940 సీట్లున్నాయి. ఉత్తరాదిలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నదే తప్ప కళాశాలల సంఖ్య పెరగడం లేదు. వీటిలో దక్షిణాదిలోనే మొత్తం 270 మెడికల్ కాలేజీలు ఉన్నాయి. అంటే దేశంలోని మొత్తం వైద్య కళాశాలల్లో 38 శాతం దక్షిణాదిలోనే ఉన్నాయి. ఇక సీట్ల విషయానికొస్తే.. దక్షిణాదిలో 43,525 సీట్లు ఉండగా.. దేశంలోని మిగతా రాష్ట్రాల్లో 65,415 సీట్లున్నాయి.

దక్షిణాదిలో భారీగా కళాశాలలు, సీట్లు ఉన్నప్పటికీ విద్యార్థులకు మాత్రం ప్రవేశాలు దక్కడం లేదు. గడచిన మూడేండ్లుగా టాప్-100 జాబితాలో దక్షిణాది, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తున్నది. గతంలో ఈ జాబితాలో మనోళ్లు కనీసం 2530 మంది ఉండేవారు. నిరుడు 687కు పైగా మార్కులను సుమారు వెయ్యి మంది సాధించగా.. అందులో 40 మంది తెలుగువారే. ఈసారి 687కు పైగా మార్కులు సాధించిన వారి సంఖ్య దాదాపు ఏడు వేలకు పెరిగింది. అయినప్పటికీ మన తెలుగువాళ్ల ప్రాతినిధ్యం మాత్రం పెరగలేదు.

అవకతవకల నేపథ్యంలో నీట్‌ను రద్దు చేసి మరోసారి పరీక్షను నిర్వహించాలి. ఈసారి ఆన్‌లైన్‌లోనే నిర్వహించి అవకతవకలకు చెక్ పెట్టాలి. అ దేసమయంలో ఎన్టీయేను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉన్నది. తద్వారా తెలంగాణ విద్యార్థులతో పాటు దక్షిణాదికి మేలు జరుగుతుంది.